క్లుప్తంగా

సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

మంథని: సరస్వతి పుష్కరాల సందర్భంగా మంథని బస్టాండ్‌లో ప్రయాణికులకు సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ అన్నారు. శుక్రవారం ఆయన బస్టాండ్‌ను సందర్శించి ప్రయాణికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన టెంట్ కూలిపోయి వర్షం నీటితో బస్టాండ్ ప్రాంగణం నిండిపోయినా పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ప్రయాణికులకు సరిపడా బస్సులు నడిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధికార ప్రతినిధి పోతరవేని క్రాంతికుమార్, మండల అధ్యక్షుడు వీరబోయిన రాజేందర్, పట్టణ అధ్యక్షుడు సబ్బని సంతోష్, ప్రధాన కార్యదర్శి సామల అశోక్, ఓబీసీ మండల అధ్యక్షుడు రేపాక శంకర్, నాయకులు విష్ణు, శంకర్, సంతోష్, జెట్టి శంకర్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో వైశాఖ మాసం ఏకాదశి సందర్భంగా శుక్రవారం ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని శివకేశవ ఆలయంలో ఉపవాస దీక్షలతో మామిడి పండ్ల రసాలతో, పంచామృతాలతో శివకేశవులకు అభిషేకం చేశారు. పందిల్లలోని శివాలయంలో మహిళలు మారేడు దళాలతో లక్ష బిల్వార్చన చేశారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి, సారెచీర, గాజులు, పసుపు కుంకుమలు సమర్పించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.

పుట్ట మధు చేసిన ఆరోపణలు సరికావు

మంథని: జెడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు ఆరోపణలు సరికావని మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అక్బర్ అలీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమీల్ అహ్మద్ అన్నారు. మంథనిలో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా మైనార్టీ సెల్ సమావేశంలో వారు కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. కాళేశ్వరంలో గురువారం విలేకరుల సమావేశంలో పుట్ట మధు మట్లాడిన తీరు చూస్తే చాలా విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయంగా విమర్శలు ప్రతి విమర్శలు చేసుకోవాలి గానీ దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌పై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి జనగామ నర్సింగరావు, ఎస్సీ సెల్ మంథని డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజీమ్ ఖాన్, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు ఏజాజ్, ముత్తారం మండల అధ్యక్షుడు వాజిద్ పాషా, వసియోద్దీన్, ఎండీ వలి, ఎండీ నజీర్, మహబూబ్, అంతర్జాతీయ అవార్డు గ్రహీత ఖాజా మొయినోద్దీన్, ఖాజా మజారోద్దీన్ ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మార్కెట్ ప్రాంతంలో నీరసంగా పడి ఉన్న 40ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తిని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా శుక్రవారం మరణించాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. గురువారం రాత్రి కురిసిన వర్షంలో తడిసిపోయిన వ్యక్తికి చికిత్స చేయిస్తుండగా శుక్రవారం మరణించాడని తెలిపారు. మృతుడి ఒంటిపై తెల్ల గీతల బ్లూకలర్ రౌండ్ టీషర్ట్, బ్లాక్ కలర్ ప్యాంట్, నడుముకు బెల్ట్ ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. నలుపురంగు వెంట్రుకలు, గడ్డం ఉందని, ఎడమ చెవికి పోగు ఉందని వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 87126 56506, 87126 56507 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

గోరక్ష చట్టాలు అమలు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న వీహెచ్‌పీ నేతలు

రామగుండం: హిందువులు ఆరాధ్య దైవంగా పూజించే గోవుల పరిరక్షణ నిమిత్తం గోరక్ష చట్టాలు అమలు చేయాలని విశ్వహిందు పరిషత్ డిమాండ్ చేసింది. రామగుండం తహసీల్దార్ శ్రీపాద ఈశ్వర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. సకల దేవతలకు నిలయంగా భావించి పూజించే గోమాతకు ప్రస్తుతం సమాజంలో రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వీహెచ్‌పీ నగర కార్యదర్శి మ్యాడగోని రవీందర్‌గౌడ్, నగర గోరక్ష ప్రముఖ్ బండ రాజేశం, సహ కార్యదర్శి కొండపర్తి లింగన్న, మునిగాల సంపత్, ములుకుంట్ల శ్రీనివాస్, బజరంగ్‌దళ్ సహ ప్రముఖ్ మ్యాడగోని అరవింద్, రమేశ్, మోహన్‌రాజు ఉన్నారు.

త్వరలోనే బయోమెట్రిక్ విధానం



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీసీహెచ్ఎస్ శ్రీధర్



అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేస్తున్న డీసీహెచ్ఎస్

- డీసీహెచ్ఎస్ శ్రీధర్
- మంథని ప్రభుత్వాసుపత్రి తనిఖీ
- విధులకు హాజరుకాని వైద్యులకు మెమోలు జారీ

సాక్షి స్పందన

మంథని: మంథని ప్రభుత్వాసుపత్రిలో త్వరలోనే బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం అమల్లోకి తెస్తున్నట్లు జిల్లా వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల సూపరింటెండెంట్(డీసీహెచ్ఎస్) డాక్టర్ శ్రీధర్ తెలిపారు. మంథని ప్రభుత్వాసుపత్రిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. 'రోగులపై నిర్లక్ష్యం.. దురుసు ప్రవర్తన' అనే శీర్షికన సామాజిక వైద్యశాలలో నెలకొన్న పరిస్థితులపై 'సాక్షి'లో ఈ నెల 21న ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు సామాజిక వైద్యశాలతో పాటు మాతాశిశు ఆస్పత్రిని డీసీహెచ్ఎస్ సందర్శించారు. ఈ సందర్భంగా విధులకు హాజరు కాని వైద్యులకు మెమోలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులు, గర్భిణులకు అందించే వైద్యసేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. మార్పు రాకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. భారీ వర్షాల నేపథ్యంలో అంబులెన్స్, 102 వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన ఆదేశించారు.

డిప్యుటేషన్‌లో అధికారులు.. ఇబ్బందుల్లో ప్రజలు

- కమాన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్, టైపిస్ట్ పోస్టులు ఖాళీ



కమాన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయం

కమాన్‌పూర్: కమాన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పలువురు అధికారులు డిప్యుటేషన్‌పై వెళ్లారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో తొమ్మిది గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో రాజాపూర్, లింగాల, ముల్కలపల్లి రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. మండలంలో సుమారు 25వేల జనాభా ఉంది.

ఇబ్బందుల్లో ప్రజలు..

తహసీల్దార్ కార్యాలయానికి కొన్నినెలల క్రితం డిప్యూటీ తహసీల్దార్‌గా వచ్చిన రాజేంద్రప్రసాద్ అడిషనల్ కలెక్టర్‌కు డిప్యుటేషన్‌పై సీసీగా వెళ్లారు. రెండు ఆర్ఐ (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు) పోస్టులు ఉండగా ఆర్ఐ-2 శమీరోద్దీన్ విధుల్లో చేరిన కొన్నిరోజులకే కలెక్టర్ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. ప్రస్తుతం ఆర్ఐగా ఉన్న స్రవంతి కొన్నిరోజుల నుంచి ఎలిగేడు మండలంలో జరుగుతున్న భూభారతి సర్వేలో విధులు నిర్వహించడానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కిరణ్ కొన్నిరోజుల నుంచి సర్వే ట్రెనింగ్‌కు వెళ్లారు. దీంతో అధికారులు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

పోస్టులు ఖాళీ..

తహసీల్దార్ కార్యాలయంలో భూములు సర్వే చేసే సర్వేయర్, టైపిస్టు పోస్టులు కొన్నేళ్ల నుంచి ఖాళీగా ఉన్నాయి. కానీ ఉన్నతాధికారులు మాత్రం అధికారులను నియమించడం లేదు. సర్వేయర్ లేకపోవడంతో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. రామగిరి మండలానికి చెందిన సర్వేయర్‌ను ఇక్కడ డిప్యుటేషన్‌పై నియమించారు.

కలెక్టర్‌కు విన్నవించాం

తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు డిప్యుటేషన్‌పై వెళ్లారు. జూనియర్ అసిస్టెంట్ సర్వే ట్రెనింగ్‌కు వెళ్లడంతో కార్యాలయంలో పనులు పెండింగ్ ఉన్నాయి. డిప్యుటేషన్‌లో వెళ్లిన వారిని తిరిగి పంపించాలని కలెక్టర్‌కు విన్నవించాం.

– వాసంతి, తహసీల్దార్, కమాన్‌పూర్

రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాలపై చర్యలు



జరిమానా విధిస్తున్న కానిస్టేబుల్

సుల్తానాబాద్‌రూరల్: రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సుల్తానాబాద్ పోలీసులు చర్యలు చేపట్టారు. సుల్తానాబాద్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న చిన్నకల్వల–దుబ్బపల్లి గ్రామాల పరిధిలోని రాజీవ్ రహదారిపై నిత్యం ఏదో ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. కాగా సీఐ సుబ్బారెడ్డి ఆదేశాలతో ఎస్సై శ్రావణ్‌కుమార్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఎక్కువగా రాంగు రూట్ ప్రయాణంతోనే ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో కోమండ్లపల్లి నుంచి వచ్చే రాంగ్‌రూట్ వాహనాలను, దుబ్బపల్లి, గర్రెపల్లి, తదితర ప్రాంతాల్లో వాచ్ కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసి వచ్చిన వాహనాలను అడ్డుకొని జరిమానా విధిస్తున్నారు. దీంతో వాహనాదారులకు రాంగురూట్‌లో వెళ్లాలంటే జంకుతున్నారు.

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడికి శుభాకాంక్షలు



మందకృష్ణతో దళిత సంఘాల ప్రతినిధులు

రామగుండం: హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీకి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో శుక్రవారం వెళ్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగకు రామగుండం రైల్వేస్టేషన్‌లో దళిత సంఘాల ప్రతినిధులు కలిశారు. ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో పద్మశ్రీ అవార్డు స్వీకరించేందుకు వెళ్తున్న మంద కృష్ణమాదిగకు వారు శుభాకాంక్షలు తెలిపారు. కొండల రాజేందర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• కొనసాగుతున్న దరఖాస్తుల పరిశీలన

ఎలిగేడు: జిల్లాలో ఎలిగేడు మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని మండలంలోని 12 గ్రామాల్లో ఈనెల 5 నుంచి 21వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈనెల 20న రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణారావు ముప్పిరితోటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరై ప్రజలకు భూభారతిపై అవగాహన కల్పించారు. ఈ సదస్సుల్లో వివిధ రకాల భూసమస్యల పరిష్కారం కోసం 1281 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ యాకన్న, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సందర్శించి పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు దాదాపు 300కుపైగా దరఖాస్తుల పరిశీలన జరిగినట్లు డిప్యూటీ తహసీల్దార్ పేర్కొన్నారు.

• అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

కమాన్‌పూర్: రైతులకు అందించడానికి పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రామృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు తీసుకునే రైతులు పట్టాదారు పాసుపుస్తం, ఆధార్‌కార్డులు తీసుకొని మండలంలోని రైతువేదికల్లో అందుబాటులో ఉండే ఏఈవోలతో పర్మిట్ తీసుకొని డీసీఎంఎస్ కమాన్‌పూర్, గుండారం, ఏఆర్ఎస్‌కేలో డబ్బులు చెల్లించి విత్తనాలు తీసుకోవచ్చన్నారు.

• ఓదెల తహసీల్దార్ బాధ్యతలు స్వీకరణ

ఓదెల: ఓదెల తహసీల్దార్‌గా ధీరజ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పనిచేసిన తహసీల్దార్ సునీత పెద్దపల్లికి బదిలీ అయ్యారు.

• పాలకుర్తి తహసీల్దార్‌గా..

పాలకుర్తి: పాలకుర్తి మండల నూతన తహసీల్దార్‌గా జెర్రిపోతుల సునీత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

• తహసీల్ కార్యాలయం సందర్శన

ఓదెల: ఓదెల తహసీల్ కార్యాలయాన్ని పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య శుక్రవారం సందర్శించారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. రైతుల రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని, పెండింగులో ఉన్న రైతుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. తహసీల్దార్ ధీరజ్‌కుమార్ ఉన్నారు.

• నేడు అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయం 24వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఆలయంలో విశేష అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన గురు స్వామి అనుమభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం అభిషేకాలు, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ, సాయంత్రం పడిపూజ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

• జీతాలివ్వని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలి

కోల్‌సిటీ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులకు నెలనెలా జీతాలివ్వని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని గోదావరిఖనికి చెందిన ఫైట్ ఫర్ బెస్ట్ సొసైటీ సంస్థ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశాడు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుమారు 10వేల మందికిపైగా వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారని, వీరందరికీ జీతాలు చెల్లించే విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు.

• టీచర్లు సమాజానికి మార్గదర్శకులు

కాల్వశ్రీరాంపూర్: ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులని తహసీల్దార్ పుల్లూరి జగదీశ్వర్ రావు అన్నారు. ఎంఆర్సీ భవనంలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి శుక్రవారం ఆయన హాజరై మాట్లాడారు. తహసీల్దార్ రచించిన బాలల కథల పుస్తకాలను ఉపాధ్యాయులకు అందించారు. ఆర్పీలు స్వప్న, కుమార్, వేణు, సంపత్, భానుచందర్, దేవేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• సీనియర్ కాంట్రాక్టర్ మృతి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ ఆరో డివిజన్ కృష్ణానగర్‌లో నివసిస్తున్న ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు సీనియర్ కాంట్రాక్టర్ కొత్త మోహన్‌రావు(70) అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఆయన మృతిపై పట్ల పలువురు సంతాపం తెలిపారు. కృష్ణానగర్‌లోని ఆయన మృతదేహానికి పలువురు నివాళి అర్పించారు.

• 28న ఉద్యమకారుల ఫోరం సభ

మంథని: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 28న జిల్లా కేంద్రంలో సభ ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ తెలిపారు. సభకు హాజరుకావాలని మంత్రి శ్రీధర్‌బాబును ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ఉద్యమకారులు స్వచ్ఛందంగా తరలివచ్చి సభ విజయవంతం చేయాలని కోరారు. ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంథని విజయకుమార్, నూనె రాజేశం, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం దేవేందర్, మంథని డివిజన్ కన్వీనర్ గోగుల రాజిరెడ్డి, మంథని మండల అధ్యక్షుడు కాసిపేట సాంబయ్య, మండల ప్రధాన కార్యదర్శి జాడి జంపయ్య, కార్యదర్శి పల్లె రాజయ్య, మండల ఉపాధ్యక్షుడు రోడ్డు లింగయ్య, మండల ఉపాధ్యక్షుడు కండేల సమ్మయ్య ఉన్నారు.

మంత్రిని విమర్శిస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబును విమర్శిస్తే సహించేది లేదని ఐఎన్‌టీయూసీ ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ శంకర్ నాయక్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజకీయంగా ఎదుర్కోలేక ఇష్టారాజ్యంగా విమర్శిస్తే వారికి తగిన గుణపాఠం తప్పదన్నారు. ఐఎన్‌టీయూసీ నాయకులు దశరథంగౌడ్, మల్లేశ్, సమ్మయ్య, అశోక్, సురేశ్, కిషన్ నాయక్, వీరారెడ్డి, కృష్ణ, అనిల్, మధు తదితరులు పాల్గొన్నారు.

పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన

యైటింక్లయిన్‌కాలనీ: కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ సీపీఐ. (ఎంఎల్) న్యూడెమోక్రసీ మంథని డివిజన్ ఆధ్వర్యంలో శుక్రవారం యైటింక్లయిన్‌కాలనీలో నిరసన తెలిపారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మంథని డివిజన్ కార్యదర్శి బి.అశోక్, లింగయ్య, మధునమ్మ, శారద, పోచం, స్వామి, రజిత, లక్ష్మి, రాయమల్లు, సదానందం పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న ఎల్లాగౌడ్

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్ అన్నారు. జీడీకే–2ఏ గనిలో శుక్రవారం కార్మికులను కలిసి పలు సమస్యలు తెలుసుకున్నారు. క్యాంటీన్‌లో సీటింగ్ సౌకర్యం సరిగా లేదని, నిలబడి టిఫిన్లు చేయడంతో ఇబ్బంది పడుతున్నామని కార్మికులు పేర్కొన్నారు. మైన్‌కు వచ్చే దారిలో బొగ్గు కుప్పలు ఉన్నాయని, వాటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వాటిని తొలగించేలా యాజమాన్యంతో మాట్లాడాలని కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన కార్మికులకు హామీ ఇచ్చారు. నాయకులు రంగు శ్రీను, కారంపూడి వెంకన్న, ఎరవెల్లి రాజయ్య పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

భారీ యంత్రాలను వినియోగించుకోవాలి



పూజలు చేస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: భారీ యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ–1 జీఎం లలిత్ కుమార్ సూచించారు. ఏరియాలోని జీడీకే–5 ఓసీపీలో రూ.3.60కోట్లతో కొనుగోలు చేసిన నూతన షావల్స్‌కు శుక్రవారం ఆయన పూజలు నిర్వహించి ప్రారంభించారు. నూతన షావల్స్‌కు మంజీర, మానేరుగా నామకరణం చేశారు. అనంతరం జీఎం మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఈ షావల్స్ ద్వారా మరింత బొగ్గు ఉత్పత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మడ్డి ఎల్లాగౌడ్, ఆరెల్లి పోశం, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఏరియా ఇంజనీరు దాసరి వెంకటేశ్వర్‌రావు, ఏఎస్ఓ సాయిప్రసాద్, మేనేజర్ పోనుగోటి శ్రీనివాస్, రమేశ్‌బాబు, పెరుమాల శ్రీనివాస్, సివిల్ ఎస్ఈ వరప్రసాద్ పాల్గొన్నారు.

ఏరియా హాస్పిటల్‌లో మందుల కొరత లేకుండా చూడాలి



ఆసుపత్రి తనిఖీ చేస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి ఏరియా ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ ఆదేశించారు. ఏరియా సింగరేణి ఆసుపత్రిని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో మందుల స్టోరేజీ తీరు, పేషెంట్‌లకు అందుతున్న మందుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్క ఉద్యోగికి తప్పనిసరిగా మందులు ఇవ్వాలన్నారు. పేషెంట్‌లకు తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఏరియా హాస్పిటల్‌లోని క్యాజువాలిటీ వార్డును సందర్శించి, అక్కడ పేషెంట్‌లకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. జీఎం వెంట డీవైసీఎంవో డాక్టర్ అంబిక, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి ఉన్నారు.

సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

గోదావరిఖని: సింగరేణిలో కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న మారుపేర్లు, విజిలెన్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట శుక్రవారం ఆయన ఐఎఫ్‌టీయూ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సంస్థ కోసం అహర్నిశలు శ్రమించి అనారోగ్య కారణాలతో మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. డిపెండెంట్ల ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుంటే విజిలెన్స్ అధికారులు మారుపేర్ల సాకు చూపి ఉద్యోగం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. గతంలో మారుపేర్ల సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వాలు ఇప్పటికీ పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మారుపేర్ల సమస్య పరిష్కరించి విజిలెన్స్ పెండింగ్ కేసుల బాధితులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు నరేశ్, అశోక్, మారుపేర్ల బాధిత సంఘం నాయకులు శ్రావణ్, శ్రీనివాస్, రామిల్ల సందీప్, కొమరమ్మ, వెంకటేశ్, రాజు, రామకృష్ణ, మల్లేశం, చింతల శేఖర్, ఎస్.ప్రసాద్, చంద్రయ్య, కొమరయ్య, ఎడ్ల రవికుమార్, సదానందం పాల్గొన్నారు.

ఆందోళనలతోనే సమస్యలు పరిష్కారం



సమావేశమైన అధికారుల సంఘం నాయకులు

గోదావరిఖని: ఆందోళనలతోనే అధికారుల సమస్యల పరిష్కారం అవుతాయని సీఎంఓఏఐ నాయకులు పెద్ది నర్సింహులు అన్నారు. సింగరేణి అధికారుల సంఘం ఆర్జీ–2, 3 ఏరియాల అత్యవసర సమావేశం శుక్రవారం ఆర్జీ–2 ఏరియా ఎన్‌సీఓఏ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్‌పీ చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. అధికారుల క్వార్టర్లకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, అధికారుల పిల్లలకు ఐఐటీ, ఐఐఎం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలని కోరారు. కోలిండియా అధికారులకు పీఆర్‌పీ చెల్లించినప్పటికీ సింగరేణి అధికారులకు చెల్లించడంలో యాజమాన్యం జాప్యం చేస్తోందని వాపోయారు. సమస్యల పరిష్కారంలో జాప్యంపై తీవ్ర అంసతృప్తి వ్యక్తం చేశారు. నాయకులు పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న సింగరేణి ఉద్యోగులకు శుక్రవారం జీఎం కొలిపాక నాగేశ్వరరావు ఆదేశాల మేరకు క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. 171 క్వార్టర్లు ఖాళీగా ఉండగా ఫ్రెష్ అలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ కోసం 66మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ఇన్‌చార్జి పర్సనల్ విభాగాధిపతి గుర్రం శ్రీహరి తెలిపారు. 19 మంది ఉద్యోగులు హాజరవగా 18 మంది క్వార్టర్లు ఎంపిక చేసుకున్నారని, వారికి త్వరలోనే అలాట్‌మెంట్ లెటర్లు ఇస్తామని పేర్కొన్నారు. గుర్తింపు సంఘం నాయకుడు డి.తిరుపతిరావు, సివిల్ విభాగం అధికారి ఫణీంద్ర, ఎస్టేట్ విభాగం అధికారి మణిదీప్ రెడ్డి, క్వార్టర్ల విభాగం సిబ్బంది రమ్య, సదయ్య పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు

సాక్షి స్పందన

జ్యోతినగర్: రామగుండం నగరపాలక సంస్థ నాలుగో డివిజన్ కృష్ణానగర్‌లో సీసీరోడ్లు నిర్మించడానికి రూ2.కోట్లు మంజూరు చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 19న 'సాక్షి'లో కొత్త రోడ్డు..ఇంకెప్పుడు? అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. నాలుగో డివిజన్‌లో పాత రోడ్లు శిథిలంకావడం, కొత్త కాలనీలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం సీసీరోడ్లు నిర్మించాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. అంచనాలు తయారు చేసి సమర్పించాలని గత నెల 16న కలెక్టర్ ఆదేశించగా నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ అధికారులు రూ.2కోట్లతో పనులు చేపట్టడానికి అంచనాలు తయారు చేసి సమర్పించారు. ఈ అంచనాలకు కలెక్టర్ ఆమోదం తెలపడంతో పాటు రూ.2కోట్లు మంజూరు చేస్తూ వెంటనే పనులు చేపట్టడానికి తగు చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్ఏసీ) అరుణశ్రీ తెలిపారు.

ఎన్టీపీసీ, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్ సమస్యలు పరిష్కరించాలి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం, సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర మినిమమ్ వేజ్ బోర్డు అడ్వైజ్ చైర్మన్ జనక్ ప్రసాద్‌కు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఐఎన్టీయూసీ కార్యదర్శి పూసాల తిరుపతి శుక్రవారం వినతిపత్రం అందించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కాంట్రాక్టు కార్మికులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని, ఆయా సంస్థల అధికారులు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో చర్చించాలని కోరినట్లు తెలిపారు.